కథానిక

# నడిమిబడుగుల నరకం

ఓగేటి శివరామకృష్ణ

సాయంకాలం భర్త ఇంటికి రావటంతోటే శకుంతల "పెళ్ళిచేసిచూడు" సినిమాకు యీ వేళ తీసుకెళ్ళండి అని అడుగుదామనుకొంది.

కామేశ్వరరావు ఆ సినిమా అంత క్రితమే చూశాడు; "చాలా బాగుంది" అని తనతో కూడా ఒకటిరెండుమార్లన్నాడు; తానూ యిదివరకు సమయాన్ని పురస్కరించుకొని "నన్ను తీసుకెళ్ళరూ" అని అడిగింది.

"అలాగేలే. నాల్గువారాలు పోనీ" అన్నాడతను.

నాలుగువారాలు జరిగిపోయాయి...సినిమా చూసిన వాళ్ళంతా ఎంతో బాగుందని మెచ్చుకుంటూంటే - తానెప్పుడు చూస్తానా అని ఆదుర్దా చూపసాగింది...

"ఎవరో," "అమ్మా నొప్పూతే!" "ఏడుకొండలవాడా!" ఇత్యాదిపాటలు, అప్పుడే ఆమె కంఠంలోంచి బయటపడుతున్నాయి కూడాను.

భర్త వారంరోజులక్రితం- తానుపాడుతూంటే అన్నాడుకూడాను: "ఆ పి.లీల, జిక్కీల కంఠాలకు నీ కంఠం ఏం తక్కువ" అని. తానూ బాగా పాడుతుంది. తానూ సినిమా తారలంత బాగా పాడిందా? అసలు వరుసే తనకు సరిగా తెలియదే! ముష్టి వాళ్ళక్కడక్కడ, వాక్యాలువదలి పాడుతూంటే తానూ వాటిని పట్టుకొని, హంగానూ చేస్తూన్న దన్నమాట.

ఎలాగయినాసరే యీదినం సినిమాకు వెళ్ళితీరాలి! వాగ్దానం ఇచ్చిన భర్త, భంగపరుస్తాడా?

"తీసుకెళ్లుతాను" అన్నాడు.

"నాలుగువారాలు జరగనీ" అన్నాడు.

నాలుగు వారాలు జరిగాయి.

మరి సినిమాకు తీసుకెళ్ళటమేతర్వాయి.

ఈ ఉద్దేశం, శకుంతలకు మధ్యాహ్నం రెండుగంటలవేళ నిద్రలేచి, నిలువుటద్దం దగ్గర కూర్చుని, జడవేసుకుంటూంటే కల్గింది.

ఉద్దేశం కల్గటంయేమిటి- వెంటనే ఉద్దేశానికి ఆకారం యివ్వటం ప్రారంభించింది శకుంతల. ఇంకా యింట్లో పిల్లా పీచూ బయలదేరలేదు, ఒంటికాయ శొంటికొమ్ము! భర్తకు ఇష్టంఉండదు గాని, హాయిగా-ఎన్ని ఆటలయినా ఆడచ్చు; ఎంత స్వేచ్ఛగానయినా, షికార్లుచేయచ్చు; కాని భర్తగారికవన్ని కంటకాలు.

తనకు సరదాఉన్నా, ఆటంకాలు మరేమీ లేకపోయినా. అలాటివి ఆయనకు కంటకంగా ఉన్నప్పుడు, తాళికట్టించుకొన్న తానేంచేయ కల్గుతుంది?

సినీమామీద ధ్యాసతో, పనులన్నీ చెకచెక సాగిపోయాయి. అయిదు గంటలకే వంట, వేపుడూ పూర్తయిపోయాయి.

అయిదున్నరగంటలయ్యేసరికి, నీళ్ళుపోసుకుని తెల్లచీర కట్టుకొని, భర్తగారిని ఆకర్షించేలా తయారయి, ఆయన రాకకోసం యెదురుచూడసాగింది శకుంతల.

* * *

ఆ వేళ ఒకటో తారీకే అయినా, రావలసిన జీతం రాలేదు. సంతకం పెట్టకుండా ఆఫీసరు క్యాంపుకి వెళ్ళాడు. ఒకటో తారీఖును పురస్కరించుకొని, ఒకళ్లిద్దరకు, సాయంకాలం కనిపించమని ప్రొద్దుటే చెప్పాడు కామేశ్వరరావు.

కాని ఆఫీసరుగారు తమ అవసరాలు చూస్తారా? క్యాంపుకు పోయేవాడు తిన్నగా పోక కామేశ్వరరావుదగ్గిర కొచ్చి, అతని ఫైల్సు "చెక్" చేసి, నాలుగు చీవాట్లువేసి, తానెక్కడనుంచో దిగివచ్చినవాడి విధంగా "ఈలాంటి బండలందరినీ మాకంట గట్టారు! పనీ చేతకాదు! చట్టు బండలూ లేదు" అని విసుక్కొని ఒక

మనిషి ఒక రోజులో చేయలేనంత పని చేతికిచ్చి సాయంకాలం తాను వచ్చేసరికి సరిచేయాలిసిందని చెప్పి వెళ్ళిపోయాడు.

"వెధవ ఉద్యోగం" కామేశ్వరరావుకి కళ్ళ నీళ్ళ పర్యంతం వచ్చాయి. అయితే యెంత తంటాలుపడితే యెందరు ప్రభువుల్ని ఆశ్రయిస్తే వచ్చిందీ ఉద్యోగం!

ఆ ఉద్యోగంవల్ల నేగదా — ఇప్పుడు తానొక యజమాని అయ్యాడు; భార్యతో హాయిగా, మరో గొడవలేకుండా ఆరు మాసాలనుంచీ సుఖంగా ఉండకలుగుతున్నాడు. మరేం చచ్చేది!

కామేశ్వరరావు విసుక్కుంటూనే, తన్ను తాను తిట్టుకుంటూనే, ఆఫీసరు చెప్పిన పర్కంతా, కాఫీ తాగటానికయినా వెళ్ళకుండా కూర్చుని చేశాడు. ఊపిరయినా పీల్చకుండా-కూర్చుని చేస్తే సాయంకాలం అయిదు గంటలకు పని యెలాగో అయింది. అయితేనేం - కామేశ్వరరావు తల దిమ్మెత్తిపోయింది.

"ఏమయ్యా అయిందా?" ఆఫీసరుగారు వచ్చారు టీకుటూరుగా తయారై.

"అయిందండి."

"చూశావా, ఇంకా ఎన్ని తప్పులో" విసుక్కొన్నాడాయన.

"ఇప్పటిదాకా, గాలయినా పీల్చకుండా చేశాను."

"వీటిని సరిచెయ్యవయ్యా."

"నా తల బ్రద్దలయిపోతూందండి. రేపు చూస్తాను." ఎంతో క్షోభమీదన్నాడు కామేశ్వరరావు.

"తల బ్రద్దలయిపోతూంది. ఏం చేయమంటారు?" దీనంగా చూశాడు కామేశ్వరరావు ఆఫీసరువైపు.

దర్జాగా జీపులో తిరిగివచ్చిన ఆఫీసరుకి ఇప్పటికి దయ కలిగింది. తానెంతో దయగా క్లర్కులను చూస్తున్నట్లుగా పోజుపెట్టి "సరే రేపు కొంచెం పెందరాళేవచ్చి సరిచెయ్యి. మరెప్పుడు ఎదురు చెప్పకు" అన్నాడు.

"అమ్మయ్య!" అని ఒక్కసారి గట్టిగా గాలి పీల్చాడు కామేశ్వరరావు.

"అందరూ ఈవేళ బిల్లు మార్చుకొన్నారండి."

"మార్చుకోనీ. ఖంగారెందుకయ్యా."

ఖంగారు లేదట-ఆయన కేం తెలుస్తుంది! దొంగ టూరుబిల్లులు తయారుచేసి, స్వయంగా సర్టిఫై చేసుకుని, డ్రా చెయ్యటమేగా ఆయన ఉద్యోగం.

"డబ్బవసరంగా ఉంటుండి."

"రేపో ఎల్లుండో మార్చుదాంలే!"

"సెలవండి"-కామేశ్వరరావు బయటపడ్డాడు.

రేపో ఎల్లుండోట! ఆఫీసర్లకున్న తెగులే అది.

"ఏమండీ?"—ఎదురొచ్చాడు శెట్టి.

"ఈవేళ బిల్లు మార్చలేదు. రేపో ఎల్లుండో చేతపడటంతోనే యిస్తాను."

"అందరూ బిల్లులు యీవేళ మార్చుకుంటే మీరు మార్చుకోపోవటం యేమిటండీ? కిందటి నెల్లో యిస్తానని దగాచేశారు."

తానివ్వకుండా పారిపోయినట్లుగా మాటాడుతున్నాడు షాహుకారు. "క్రితం మాసంలో అనుకోని అవాంతారాలొచ్చిపడ్డాయ్ అందువల్ల యివ్వలేకపోయాను" కామేశ్వరరావు ఓపిగ్గా సర్ది చెప్పాడు.

"కాని ఏమో మీమీద నమ్మకం సన్నగిల్లుతోంది. ఈలా నెలపొడుగునా సరుకులు తెచ్చుకోటం. మరుసటి నెలారంభంలో డబ్బడిగితే, మార్చుకుతింటూ రేపు రేపనటం బాగుందయ్యా వరస" షాహుకారు సణుక్కుంటూ వెళ్ళిపోతున్నాడు.

కామేశ్వరరావుకు తలకొట్టేసినట్లయింది. ఎలాగయినా యువకుడు. అందులో ఉద్యోగం సంపాదించుకొని సరిగా ఆరుమాసాలుగూడా అవలేదు; అలాంటప్పుడు, ముసలివాళ్ళకుండే ఓర్పు సహనం, యితనికెక్కడుంటాయి?

"రేపు సాయంకాలం కనపడవయ్యా! నీలాంటి వాళ్లదగ్గిరసలు సరుకు తీసుకోవటమే తప్పు—నీ బాలన్సు క్లియరుచేస్తాను."

"మంచిదండి" షాహుకారు తనకు పట్టనట్లుగా అన్నాడు వెళ్ళిపోతూనే.

"ఏదో అవసరంకొద్దీ అన్నాను. మీ డబ్బెక్కడికిపోతుందండి" అని కొంచెం సామరస్యంగా మాట్లాడుతా డనుకొన్నాడు తాను.

సరే. వీడి పీడ రేపు వదిలించుకోవాలి. అబ్బ! సందట్లో కాఫీసంగతే మరచిపోయాడు. కాఫీ హోటలుదాటి వచ్చేశాడుకూడాను. తల బ్రద్దలయిపోతూంది.

హోటలుకొచ్చి కాఫీతెప్పించుకొని తాగుతూ యేమిటో ఆలోచిస్తున్నాడు; రేపు బిల్లు క్యాషు చెయ్యక యేంచేస్తాడు? వాడి ప్యాస్‌పుస్తకం నిలవకోసం, పోస్టాఫీసులో ఎదురుమాడటంలేదూ వెధవ తెలివితేటలూ వాడూనూ వాడూ ఒక ప్యూను, ఒకళ్లచేత చివాట్లు తిన్నవాడేగా! రేపు క్యాషు చెయ్యక ఏం చేస్తాడులే.

కాఫీతాగి బిల్లు చెల్లించి బయటకు వస్తూ జేబు చూసుకొన్నాడు; సరిగ్గా పదమూడు అణా లన్నర! ఇది రేపటిదాకా, అంటే జీతం అందు కొనేదాకా తన ఆస్తి—సర్వస్వం!

"పువ్వులండి" మామూలుగా పువ్వులిచ్చే కుర్రవాడు కామేశ్వరరావుకు పువ్వుల పొట్లంతో యెదురు వచ్చాడు.

వాడి తప్పేముంది? రోజూ తను పుచ్చు కుంటున్నాడు గనుక వచ్చాడు.

"డబ్బుల్లేనట్లున్నాయ్"నానుస్తూ అన్నాడు.

"పోనీ రేపివ్వండి."

చీకటి పడింది. ఎప్పుడో పొద్దుట తిన్న భోజనం. పొట్ట నకనకలాడుతోంది; పైగా ఆఫీ సరు పెట్టిన చివాట్లు -అంతకు పైగా బిల్లు మార్చకపోవటం- ఆ మీదట షా వు కా రు నిలవదీసి అడగటం. వాటన్నిటికీతోడు పొద్దుట నుంచీ గంట క్రితంవరకూ వంచిన తల యెత్త కుండా పనిచేయటం.

కాఫీ త్రాగటంతో కొంచెం తలనొప్పిమాత్రం తగ్గింది.

వెళ్ళి భోజనంచేసి, వెంటనే మంచం యెక్కి నిద్రపోదామనే త లం పు తో కామేశ్వరరావు యింటికి వస్తున్నాడు.

* * *

చీకటి బాగా పడింది. శకుంతల గంట క్రితం నుంచి వీధి గుమ్మంలో నిల్చుని, భర్తకోసం ఎదురు చూస్తోంది.ఆమెకళ్ళు కాయలుకాచాయి. కామేశ్వరరావుమీద ఎంతో కోపం గూడా వచ్చింది.

చివరకు కామేశ్వరరావు దర్శనం అయింది. చేతులోని పువ్వుల పొట్లంతో, భర్త విసురుగా రావటం, శకుంతల గమనించింది. శకుంతల ఆనం దము చెప్పశక్యం కాకుండాఉంది. చేతిలో పువ్వులపొట్లంతో హడావిడిగా వస్తున్నాడంటే అంతా తానూహించినట్లుగా యెందుకు జరిగిపో గూడదూ?

పువ్వులపొట్లం ఆమె చేతిలో పడేసి విసు రుగా యింట్లోకి వస్తూ, "వంటయిందా?" అని అడిగాడు కామేశ్వరరావు. "ఆ-" అని జవా బిస్తూనే ఆలోచించటంప్రారంభించింది శకుంతల. అంత హడావిడితో వచ్చి ప్రశ్నించటంలోగల ఆంతర్యం ఎక్కడికో వెళ్ళాలని అర్థమౌతూనే ఉంది. అయినా ఉద్రేకాన్ని ఉంచుకోలేక అడి గేసింది. "ఏం ఎక్కడికయినా వెళ్ళాలా?"అని. కామేశ్వరరావు మొదట్లో వినిపించుకోలేదు. సినిమామీద ధ్యాసగల శకుంతల రెట్టించింది."ఏం లేదు!" పరధ్యానంగా అన్నాడతను. మరి శకుం తల తన ఉద్దేశాన్ని వ్యక్తపర్చటానికి అభ్యంతరం లేకపోయింది. అతడి మొఖంలోకి ప్రేమతో చూస్తూ, "ఏమండీ" అంది.

"ఏం?"తీవ్రంగా అన్నాడు కామేశ్వరరావు.

"మరి..." శకుంతల నానుస్తూంది.

"ఏమిటో త్వరగా చెప్పు చంపక!" విసుగు దలతో అన్నాడు కామేశ్వరరావు. ఆఫీసరు తన మీదచూపే ఆగ్రహం, అనుగ్రహం వగైరాలన్నీ గుమాస్తాగాళ్ళు తమ భార్యల మీదనే చూపాలి సింది మరి.

"ఏంలేదండి. మరి..."

"ఊ..."

"సినిమాకి తీసుకెళ్ళతామన్నారుకదూ?"

"ఊ... అయితే?"

"ఈ దినం తీసుకెళ్లండీ."

"మన బ్రతుక్కి సినిమా ఒక్కటే తక్కు వయింది. బుద్ధి లేకపోతే సరి నోరు మూసుకు, భోజనసంగతి చూడు" కా మే శ్వ ర రా వు తీవ్రంగా అన్నాడు. ప్రొద్దుట ఆఫీసరు తనను మాత్రం అనలేదూ? తానుమాత్రం ఏం తక్కువ తన భార్యమీద తానేగదా ఆఫీసరు. అధికారి తనమీద అధికారం చెలాయించినట్లుగా తన భార్యమీద తాను చెలాయించాలి.

శకుంతల వెలవెలబోయింది. ఆమెలోని ఉత్సాహం ఒక్కసారి చచ్చిపోయింది. ఆశించినదంతా మరోవిధంగా నడుపుతున్నందుకు భర్త మీద చెప్పలేనికోపం వచ్చిందామెకు.

"తీసుకెళ్తామన్నారు కదండీ?"

"ఇప్పుడు తీసుకెళ్ళమంటున్నాం."

"ఏమండీ—"

"నోరుమూసుకు ముందు సంగతి చూడు" అంటూ తల పట్టుకున్నాడు కామేశ్వరరావు.

"చూస్తాను"

"పొగరు" అని గర్జించాడు కామేశ్వరరావు.

శకుంతల కళ్లల్లో నీళ్లు నిల్చాయి. ఆడదంటే మొగవాళ్ళకు లోకువ?

అప్పుడే ఏమయింది. భోజనసంగతి సినీమా నుంచి వచ్చినతర్వాత చూసుకొందామని గూడా, అంతక్రితం తాననుకొంది. అంతా సవ్యంగా జరిగి ఉంటే, అప్పుడే సినీమా హాలుదగ్గరకు వెళ్ళి ఉందురు.

"ఎందుకాయేడుపు? అన్నంసంగతి చూస్తావా లేదా? వెధవ ముసురుబోతుతనం నువ్వూను"— కామేశ్వరరావు నోరు పెరిగి పెద్దదవుతోంది.

శకుంతల యెలాగో ఉబికిఉబికి వస్తున్న దుఃఖాన్ని దిగమింగుతూ పీట వేసి, కంచం పెట్టి అన్నం వడ్డించింది.

కామేశ్వరరావు భోజనానికి కూర్చున్నాడు. అతడి బుద్ధి యిప్పుడు ఆఫీసులో పని చేస్తోంది. ప్రొద్దుటే ఆఫీసుకు రావాలట దొంగ ముండావాడు. ఆ దొరగారు మాత్రం నిక్కి నీల్కి ఒక గంట ఆలస్యంగా వస్తారు. కాని ఆయన్ని అడిగే మహానుభావు డెవ్వరూలేరు.

"ఏం. మొద్దూ నీకు ఒళ్లు తెలియటంలేదూ? కంచంలో సరుకు కనిపించుతోందా?"

"లేదు. మరి వేస్తే మీరు కోపగిస్తారని తక్కువ వేశాను"

"అవును. భయభక్తులు రోజు రోజు కూ హెచ్చుతున్నాయ్ తెలుస్తూనే ఉన్నదిగా!"

"మీరేమో అంటున్నారుగాని నా ఓర్పు యెవళ్ళకూ ఉండదు."

"అవును. పొగరుబోతుతనంతో జవాబు చెప్పటంలోనే కనిపిస్తోంది ఓర్పంతా."

"ఏమిటో ఈవేళ మీరదోవిధంగా ఉన్నారు"

"అవును. నాతత్వమే అలాంటిది. రోజుకోవిధంగా ఉంటూంటుంది...చారు. నీకు బుద్ధి లేదూ? ఏమిటా పోయటం?"

"ఏం చేయమంటారు?"

"అన్నం తడిసిందా?"

"ఎక్కువ పోస్తే మరి కోపగిస్తారని!"

"భయభక్తుల కేం లోటులేదు. ఛీఛీ ఏమిటా పోయటం. చారు ఇలా పోస్తున్నావ్. నేను బతకటం నీకిష్టం లేదనుకొంటా."

"ఏమిటండీ...ఆ మాటలు."

"మళ్ళా-ఎదిరింపు."

"ఏం ఎదిరించానండీ!"

"దాన్నేమంటారు? పొగరు అంతకంతకు యెక్కువ యెక్కువవుతోంది?"

"పోగొట్టండి."

"పోగొడతాను"-అన్నం పూర్తి భోజనంలో లేచి, శకుంతల బుగ్గమీద అయిదు వేళ్ళూ అంటేలా, వాయించాడు కామేశ్వరరావు. శకుంతల బుగ్గ కందిపోయింది.

బొటబొట నీళ్లు కారుస్తూ, "మిమ్మల్ని కట్టుకొన్నది...సుఖపెడతారని కాని, బుగ్గలుకందేలా కొడతారని కాదు"

"మళ్ళీ మాట్లాడవంటే-తిండి తినకుండా లేచిపోతాను."

"నేనేం తప్పిదం చేశానని నన్ను కొట్టారు?"

"తప్పిదమా, మహా తప్పిదమా, మాటమాటకూ యెదురు పలకటం తప్పిదంకాదూ?"

"నేనేం యెదిరించాను?"

"మరి నే భోజనం చేయటం నీకిష్టం లేదను కొంటాను."


"వేయి నూటపదహార్లు కట్నం యిచ్చి, మిమ్మల్ని కట్టుకొన్నది-మీచేత దెబ్బలు తిన టానికేనా?"

"సరే నోరూరుకోదు - కానీ" కామేశ్వరరావు భోజనం ముందునుంచి లేచిపోబోయ్యాడు.

"మీరు అన్నం తినకుండా... లేస్తే నే చచ్చినంత ఒట్టే" అతడు కూర్చుండిపోయాడు.

శకుంతల పెరుగు మిగల్చకుండా గిన్నెలోనిదంతా వంచేసింది.


# నేడు మీరు మెక్లీన్‌తో పళ్లు తోముకున్నారా ?



"నేనుచిన్నప్పటినుంచీ మీటూత్‌పేస్టునువాడు తున్నాను. మిత్రులు పలువురు నాదంత శోభనుప్రశంసించి యున్నారు."

మెక్లీన్స్ పెరాక్‌సైడ్ టూత్ పేస్టు మూలంగానే ముమ్మాటికీ అమె పళ్లు నిగనిగ మెరుస్తూ, ఇగుళ్లు ఆరోగ్యంగాను, నోరు పరిమళ భరితంగాను ఉన్నవి. అది ఒకటే సమయంలో పళ్లను తెల్లగా చేసి, ఇగుళ్లను దృఢపరచి, నోరు పరిమళభరితంగా నుండునట్లు చేస్తుంది. మెక్లీన్స్ పెరాక్‌సైడ్ టూత్ పేస్టు మీకు కూడా అదే విధంగా తోడ్పడగలదు. నేటినుండే మెక్లీన్స్ వాడుక ప్రారంభించి, దానితో నిత్యం రెండు సార్లు పళ్లు తోముకొండి.

ఇప్పుడు పెద్ద సైజులోను, మితవ్యయం
నిమిత్తం భారీ సైజులోను
లభిస్తున్నది.




**దంతాలను ధవళతర మొనర్చుతుంది**

వ్యాపార వివరాలకు వ్రాయండి.

జె. ఎల్. మోరిసన్, సన్ అండ్ జోన్స్ (ఇండియా) లిమిటెడ్.

పోస్టు ఆఫీసు బాక్సు 6527 బొంబాయి 26. పోస్టు ఆఫీసు బాక్సు 397 కలకత్తా.
పోస్టు ఆఫీసు బాక్సు 1370 మద్రాసు.

MTY-20 TEL

"నే మనిషిని కాదనుకొన్నావా? నీ కేదీ?"

"నా కక్కర్లేదు!"

పెరుగుముద్ద నోట్లో పడటంతో, కామేశ్వర రావులో "శాంతం" స్వరూపంలో కనిపించ సాగింది.

"పెరుగు మారుచిగా ఉన్నదే!"

శకుంతల జవాబివ్వలేదు.

"నీకు వుంచుకో లేదేం. పోనీ యీ అన్నం ఉంచుతాను."

"నాకోసం యేం ఉంచక్కర్లేదు! మీరు తినండి."

"నే తినను-ఈ కొంచెం నీకోసం" కామేశ్వర రావు లేచి, చేయి కడుకున్నాడు.

వంటపని పూర్తి చేసుకోబోతూంది శకుంతల. పడకకుర్చీలో ప్రక్క గదిలో పరున్న కామే శ్వరరావు కామె చేష్ట లవగతమయాయి.

"నువ్వు భోజనం చేయవా?"

"..." శకుంతల మాట్లాడక, సామాను సర్ద డంలో నిమగ్న అయింది.

"నేనేం అన్నానని నీకా కోపం"-అన్నా డతను.

"అదంత యెందుకూ?"

"చెప్పండి"

"ఏదో వచ్చింది. యిప్పుడు పోయిందిగా!"

"బాగుంది!"

"నువ్వు భోజనం చెయ్యవన్నమాట."

"ఊహూఁ..."

"నేచచ్చినంతవట్టే"

"చేస్తాను. మీ మగవాళ్లయిష్టప్రకారం అన్నీ చెయ్యాలి! మా ఆడవాళ్లమాట ఒక్కటీ ఆచర రలో పెట్టగూడదు" శకుంతల కళ్లనీళ్లుపెట్టుకొని పీటమీద కూర్చుంది.

"ఓస్...ఏడుపుమాని, తొందరగా భోజనం చెయ్యి...రెండో ఆటకయినా వెడదాం."

"ఇంతవరకూ అయిన సినిమాచాలు!"

"ఏదో ఆఫీసు గొడవలో తలదిమ్మెక్కి ఏదో అన్నానేగాని, నువ్వంటే నాకెప్పుడూ కోపం లేదు."

"ఆ సంగతి ముందే చెబితే నేనడిగేదాన్ని కాదుగా."

"దానికేంలే. సినిమాకు తప్పకపోదాం! జీతం గూడా రాలేదు. అందువల్లనే బుర్రమరింత వేడెక్కి పోయింది."

"సరే అయితే! సినిమాకు తొందరేంవచ్చింది లెండి."

"నువ్వు యీవేళ వెళ్ళాలన్నావుగా. ఈవేళే తప్పకుండా వెళ్లితీరాలి. సరేగాని, నీదగ్గిరేమ యినా డబ్బులున్నాయా?"

"పావలావో, అయిదణాలో ఉంటాయ్."

"ఇకనేం. తొందరగా భోజనంచెయ్యి—నా దగ్గర పదమూడణాలచిల్లర ఉంది."

"పోనీ రేపుచూడగూడదండీ!"

"అందుకనే నాకు వస్తుంది కోపం!"

"మీకు బద్ధకంగా ఉన్నదన్నారుగా!"

"ఏమయినాసరే! ఈదినం సినిమాకు వెళ్ళి తీరాలి."

"డబ్బులేనప్పుడు?"

"వెధవ డబ్బులకేం"

"సరే అయితే!" భోజనంముగించి, కంచం కడుగుతూ శకుంతల యెంతో మురిసిపోయింది; భర్త తనను సినిమాకు తీసుకెళ్ళుతున్నందుకు కాదు-అంత మంచి భర్త లభ్యం అయినందుకు.

సోవియట్ ప్రజల జీవన ప్రమాణం ఏడాదికేడాదీ పెరుగుతోంది. ఫ్యాక్టరీ, ఆఫీసు వుద్యోగుల యథార్థ వేతనాలూ, సమష్టిరైతుల ఆదాయాలు. ఎక్కువ అవుతున్నాయి. ప్రజలకు సాంస్కృతిక సౌకర్యాలు పెంపొందింపబడుతున్నాయి. 1951 నుండి 1955 లోగా దేశ అభివృద్ధికై వుద్దేశింపబడిన నూతన పంచవర్ష ప్రణాళిక ప్రజల శ్రేయస్సును యింకా అభివృద్ధిచేయడానికి సూచనలను చేసింది.

—టాస్ వార్తాసంస్థ.